క్లుప్తంగా

ఉంగుటూరు మండల బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం

ఉంగుటూరు: నియోజకవర్గం నాలుగు మండలాల బూత్ కమిటీల విభాగాల అధ్యక్షులను నియమించారు. పార్టీ అధినేత జగన్‌మోహన రెడ్డి ఆదేశాలమేరకు కేంద్ర పార్టీకార్యాలయం ఈనియామకపు ఉత్తర్వులను శనివారం విడుదల చేసింది. ఉంగుటూరు మండలానికి చింతల కిషోర్, భీమడోలు మండలానికి కొడవళ్ళ రవికుమార్, గణపవరం మండలానికి కోట నాగేశ్వరరావు, నిడమర్రు మండలానికి గాదిరాజు సుబ్రహమణ్యరాజులను నియమించారు.

ఘనంగా మద్దిరావమ్మ సంబరాలు



గణాచారులను సన్మానిస్తున్న రామదండు నాయకులు

దెండులూరు: దెండులూరు గ్రామంలో తొగర కులస్తులు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించే మద్దిరావమ్మ సంబరం చివరి శుక్రవారం సందర్భంగా గణాచార్యులు గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి భక్తుల పూజలు అందుకున్నారు. రామదండు దెండులూరు మండలం నాయకులు సుగ్గుశెట్టి నూకరాజు, కుటుంబ సభ్యులు గణాచార్యులకు నీళ్ల వారబోసి నూతన వస్త్రాలు పండ్లు బహుకరించి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఉంగుటూరులో 35.4 మి.మీ వర్షపాతం

ఉంగుటూరు: మండలంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శనివారం మండలంలో35.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వరమిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్ఎస్ఎస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ఘోష్ కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఘోష్ (బ్యాండ్) శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వన్‌టౌన్ పరిధిలో సాయంత్రం కవాతు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు జంగారెడ్డిగూడెంకు చెందిన బొడ్డు వీరాంజనేయులు, ఈడ్పుగంటి వెంకట సుబ్బారావు, గట్టు మోహనసాయి సందీప్‌లు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను అర్చకులు సత్కరించారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు వైష్ణవ సాంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణాష్టమి పూజ ఉట్టు కొట్టే పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 16న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో ప్రారంభమై మూడు రోజు పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

అభిషేక సేవ

గుర్వాయిగూడెం మద్దిక్షేత్రంలో శనివారం స్వామి ఉత్సవ విగ్రహానికి అర్చకులు అభిషేక సేవ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,53,423 సమకూరిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. హనుమాన్ చాలీసా, కోలాటం ప్రదర్శించారు.

22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 22 నుంచి స్థానిక అంబికా దేవి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు అంబికా సంస్థల డైరెక్టర్ అంబికా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని శనివారం రాత్రి స్థానిక అంబికా దేవి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక కర్త ఎస్ అనంతలక్ష్మి విడుదల చేశారు. అమ్మవారు అంబికా దేవి రూపంలో ఉన్న ఆలయం దేశంలో ఇదొక్కటేనని చెప్పారు. ఈ ఆలయంలో ఈ ఏడాది 20వ వార్షిక శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంబికాదేవి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అర్చకుడు వారణాసి శ్రీ రాఘవేంద్ర శర్మ మాట్లాడుతూ ఈ ఏడాది శరన్నవరాత్రి మహోత్సవాలు 10 రోజుల పాటు నిర్వహిస్తామని, ఈ రోజుల్లో అమ్మవారు విశేష అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. నిత్యం ఉదయం ప్రాతఃకాల శ్రీచక్ర ఆరాధన, శ్రీ బాలా మూలమంత్ర, చండీ మూలమంత్ర, అవతార మూలమంత్ర సహిత హోమం, శ్రీచక్ర అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహిస్తామని చెప్పారు.

నిరీక్షణ.. ప్రదక్షిణ..!

నూతన పింఛన్ల కోసం అర్హుల ఎదురుచూపులు

దెండులూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు పూర్తవుతున్నా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వితంతు, వద్ధాప్య పింఛన్ల కోసం నూతనంగా దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ ఇంకా సైట్ ఓపెన్ అవ్వలేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరిగుతున్నారు.గ్రామాల్లోనిఅర్హులైన వద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ప్రభుత్వం అందజేసే పింఛన్లే ప్రధాన ఆధారం. గత ప్రభుత్వం ప్రతి నెలా రూ.3వేల పింఛన్ అందజేసేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్ నగదును రూ.4వేలకు పెంచింది. కానీ అదనంగా నూతన పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే లబ్ధిదారులకు ఎంపిక చేసి కొత్తగా అర్హులైన వారికి పింఛన్లు అందజేసింది. మొదటి మూడు సంవత్సరాల పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున నూతన పింఛన్లు అందజేసేది. ఆ తర్వాత 2023, 2024 సంవత్సరాల్లో ప్రతి ఆరు నెలలకు అర్హులైన వారు నష్టపోకుండా వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి పింఛన్లు అందజేసింది. 2024 జనవరిలో వైఎస్సార్ సీపీ హయాంలో చివరిగా నూతన పింఛన్లు అందజేశారు. తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో నూతన పింఛన్లకు బ్రేక్ పడింది. ఆవిధంగా 2024 ఏప్రిల్ నెలలో ఆగిపోయిన సైట్ నేటికీ కూడా ప్రారంభం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తయినా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హుల్లో ఆందోళన నెలకొంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబర్ నెలలో కొత్త జీవో తీసుకొచ్చింది. పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే, మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. నెలలో 15నుంచి 31వ తేదీలో చనిపోతే నెల విడిచి మరోనెలలో పింఛన్ అందజేయాలని స్పష్టం చేశారు. అయితే పింఛన్ రాని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినా, ప్రమాదంలో మృతి చెందినా అలాంటివారి భార్యలకు పింఛన్ అందజేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఏడాదిగా నూతన పింఛన్లు రాకపోవడంతో దెందులూరు మండలంలో 60సంవత్సరాలు నిండిన సుమారు 1500మందికి పైగా లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చేస్తున్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి జన్మభూమి కార్యక్రమం నిర్వహించి నూతన పింఛన్లు అందజేస్తామని గత డిసెంబర్‌లో ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి నూతన పింఛన్లు అందుతాయని ఎదురుచూసిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎదురు చూపులే మిగిలాయి.

50ఏళ్ల హామీ ఎన్నడో..?

ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే వెనుబడిన తరగతులకు చెందినవారికి 50సంవత్సరాలు పూర్తయిన వెంటనే పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. దీంతో మండలంలో సుమారు 6వేల మందికి పైగా 50 సంవత్సరాలు నిండిన వారు ప్రభుత్వ హామీ ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛను దరఖాస్తులు స్వీకరించేటప్పుడు 50సంవత్సరాలు నిండిన వారి దరఖాస్తులు కూడా తీసుకోవాలని కోరుతున్నారు.



దెందులూరు సచివాలయం

50ఏళ్లకు పింఛన్ అందజేయాలి



కూటమి ప్రభుత్వంలోచేతి వత్తుల వారికి ఎటువంటి పథకాలు అందడంలేదు. ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా వెనుకబడిన తరగతుల వారికి 50ఏళ్లకు పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లోఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు చెందిన 50ఏళ్లు నిండినవారికి వెంటనే పింఛన్లు అందజేయాలి.

– తొత్తడి వేదకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి

దరఖాస్తులు స్వీకరించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తయిన నేటికీ నూతన పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరించకపోవడం లేదు. అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పేదల జీవన విధానం ఇబ్బందులు పరిగణలో తీసుకోవాలి.

– ఎం దుర్గాకుమారి రాజు, సర్పంచ్, మేధినరావుపాలెం

అర్హులకు అందజేయాలి



అర్హులందరికీ ప్రభుత్వం నూతన పింఛన్లు అందజేయాలి. వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం అందజేసే పింఛనే ఆధారం. పింఛన్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. కనీసం ఆరునెలలకు ఒక్కసారైనా నూతన పింఛన్లు అందజేయాలి.అర్హులైన లబ్ధిదారులను గుర్తించి తక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– మండల సరస్వతి కొండలరావు, జెడ్పీటీసీ ఏలూరు

15న విజయవాడలో ధర్నాకు తరలిరండి



కాకర్ల శ్రీను

దెండులూరు: భవననిర్మాణ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం, స్వయం ఉపాధి కాపాడుతామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు కోరుతూ ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏలూరు టౌన్ ప్రెసిడెంట్ కాకర్ల శ్రీను కోరారు. శనివారం మాదేపల్లిలో ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక రాష్ట్రాల్లో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడి పై ముగ్గురు నలుగురు కుటుంబ సభ్యులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా కార్మికుల వెల్ఫేర్ బోర్డ్ ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని శ్రీను డిమాండ్ చేశారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి అభినందనీయం

ఏలూరు (టూటౌన్): గత 38 సంవత్సరాలుగా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమని డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఏలూరులోని దొండపాడులో గల పరివర్తన్ బధిరుల పాఠశాలలో ఉమా ఎడ్యుకేషనల్– టెక్నికల్ సొసైటీ నిర్వహించిన 38వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు సేవలందిస్తూ, అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిళ్లు, చక్రాల కుర్చీలు వంటివి అందించడం అభినందనీయమని అన్నారు. వ్యవస్థాపకుడు ఎస్‌పీ రెడ్డి మాట్లాడుతూ సంస్థ చేసిన సేవలకు గుర్తింపుగా 2003లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి ఉత్తమ సంస్థగా రాష్ట్రపతి అవార్డు, 2019లో మరోసారి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌నుంచి అవార్డుతోపాటు ఐదు జాతీయ అవార్డులను తమ సంస్థ అందుకుందని వివరించారు.

రాజీ మార్గం ద్వారా కేసుల సత్వర పరిష్కారం



కేసులను పరిష్కరిస్తున్న భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి

భీమడోలు: రాజీమార్గం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి లోక్ ఆదాలత్ చక్కని వేదిక అని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటి చైర్‌పర్సన్ ఎస్.ప్రియదర్శిని నూతక్కి అన్నారు. భీమడోలు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లోని 86కేసులను పరిష్కరించారు. వాటిలో 14 సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు 60, చెక్ బౌన్స్, గృహ హింసలకు చెందిన 12కేసులను పరిష్కరించారు. ఈసందర్భంగా జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి మాట్లాడుతూ అపరిష్కృతంగాఉన్న కేసులను పరిష్కారించుకునేందుకు లోక్ ఆదాలత్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. దీనివల్ల కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసులు పాల్గొన్నారు.

ఆధునిక ప్రపంచంలో ఏఐ తప్పనిసరి



కృత్రిమమేధ(ఏఐ)పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గణపవరం: ఆధునిక ప్రపంచంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలో నిలబడాలంటే ప్రతి ఒక్కరూ ఏఐపై అవగాహన కలిగిఉండాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గణపవరం డిగ్రీకాలేజి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐక్యూఏసి ఆధ్వర్యంలో కెరీర్ వృద్ధికోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నిర్మలకుమారి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ రానున్న కాలం అంతా ఏఐదేనని అందువలన విద్యార్థులు ఇప్పటినుంచే ఏఐపై పూర్తిస్థాయి జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఆధునిక ఉద్యోగరంగంలో పోటీతత్వాన్ని నిలుపుకోవడానికి ఏఐ నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏఐ పై కె.మురళీకృష్ణ శిక్షణ ఇచ్చారు. కెరీర్ అవకాశాలను అన్వేషించడం, సమాచార, ఇంటర్వ్యూ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం, స్మార్ట్ రెజ్యూమ్స్ తయారు చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ కెవిగణేష్‌కుమార్, బోటనీ, రసాయనశాస్త్ర అధ్యాపకులు చైతన్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవనోపాధికి ఒకేషనల్ విద్య దోహదం



గణపవరం బాలికోన్నత పాఠశాలలో ఒకేషనల్ విద్యార్థినులతో ఎంఈవో బాలయ్య

గణపవరం: ఒకేషనల్ విద్య జీవనోపాధికి దోహదపడుతుందని, విద్యార్థులు విద్యతోపాటు జీవనోపాధికి దోహదపడే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. ఆయన హైస్కూల్‌లో ఒకేషనల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ఒకేషనల్ విద్య ద్వారా వారికి ఆసక్తి ఉన్న విషయాలపై శిక్షణ పొందవచ్చునని, తద్వారా జీవితంలో వారు సొంత కాళ్లపై నిలబడే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థులకు ప్రతి వారం క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళ్లి, వారికి వివిధ వ్యాపారాలు, వృత్తులు, పరిశ్రమల గురించి అవగాహన కల్పించాలని, ఆయా విషయాలలో మెళుకువలు నేర్పించాలని సూచించారు. హెచ్‌ఎం తోట సింహాద్రిఅప్పారావు మాట్లాడుతూ ఒకేషనల్ విద్యలో భాగంగా విద్యార్థులను వారానికి ఒకరోజు క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళ్లి, వివిధ వ్యాపారసంస్థల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రథమశ్రేణి సహాయకుడు హోతా ఆంజనేయులు, ఉపాధ్యాయులు, ఒకేషనల్ టీచర్ స్రవంతి పాల్గొన్నారు.

అధిక లోడు లారీలతో ట్రాఫిక్ ఇక్కట్లు



అధిక లోడుతో రోడ్లపై తిరుగుతున్న లారీలు

దెండులూరు: అధిక లోడు లారీలతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నామని పాదచారులు, వాహనదారులు, షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెండులూరు మీదుగా ద్వారకాతిరుమల రహదారి నిత్యం వందలాదివాహనాలు వస్తూ వెళ్తూ ఉంటాయి. అధిక లోడు లారీలు ఫ్యాక్టరీలకు వెళ్లే సమయం పాదచారులు వాహనదారులకు ఇబ్బంది లేకుండా రాత్రి వేళల్లో తెల్లవారుజామున వెళ్లితే ఎవరికీ ఇబ్బందులు ఉండవని అంటున్నారు. ఎప్పుడుబడితే అప్పుడు అధిక లోడు లారీలు వల్ల అందరికీ తీవ్ర ఇబ్బందిగా ఉందని అన్ని వాహనాలను తనిఖీ చేసే రవాణా పోలీస్ శాఖల అధికారులు అధిక లోడు లారీలను ఎలా అనుమతిస్తున్నారు. తనిఖీలు ఎందుకు చేయట్లేదని పాదచారులు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజు నాలుగైదు అధిక లోడు లారీలు వల్ల ట్రాఫిక్ జామ్ అవటమే కాకుండా షాపులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని రవాణా పోలీస్ శాఖ అధికారులు ఎవరికీ ఇబ్బందులు లేకుండా అధిక లోడు లారీల వెళ్లే సమయాన్ని మార్చాల్సిందిగా కోరుతున్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాల్య వివాహాలను అరికట్టి, బాలికల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు ముందుకు రావాలని చైల్డ్‌రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక శనివారపుపేట శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్ అనే అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ సనాతన ధర్మం మనకు బాల్యం, పెరుగుదల, ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఉద్దేశించిందని తెలిపారు. బ్రహ్మచర్య ఆశ్రమం తర్వాత మాత్రమే గృహస్థ ఆశ్రమం వస్తుందని, వివాహం విద్య, పరిపక్వతను అనుసరించాలని సూచిస్తోందన్నారు. బాల్య వివాహం ఈ పవిత్ర కార్యక్రమాన్ని ఉల్లంఘిస్తోందని, బాధలను కలిగిస్తుందని, యుక్త వయసు రాకముందే ఏ బిడ్డను వివాహ వ్యవస్థలోనికి నెట్టకుండా చూసుకుందామని అన్నారు. ఏలూరు నగరాన్ని బాల్యవివాహరహితంగా తయారు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, అర్చకుడు హయగ్రీవాచార్యులు పూర్తి అవగాహనకలిగించారు.

అధ్వాన దారితో అవస్థలు





రాష్ట్రీయ రహదారి భీమడోలు స్టేట్‌బ్యాంకు వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో నిలిచిన వర్షపు నీరు, భీమడోలు గ్రామంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- అస్తవ్యస్త డ్రెయిన్ వల్ల రోడ్లపై నిలిచిన నీరు
- ప్రయాణికుల ఇబ్బందులు

భీమడోలు: అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు శనివారం భీమడోలులోని పలు రోడ్లపై నీరు ప్రవహిస్తుంది. శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షం నీటితో పాటు డ్రెయిన్లలోని నీరంతా రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా భీమడోలులోని స్టేట్ బ్యాంకు వద్ద గల రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు రాకపోకలు, వాహనదారులు ప్రయాణించేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొంత కాలంగా కనీసం ఆ గుంతలు పూడ్చకపోవడంతో పాటు పక్కనే ఆక్రమణలకు గురైన డ్రెయినేజీతో శుభ్రం చేయకపోవడంతో నీరంతా రోడ్లుపై తాండవిస్తుంది. అదమరిచి ప్రయాణిస్తే గోతుల్లో నిండిన నీటితో వాహనదారులు పడి గాయాలపాలైవుతున్నారు. అదే విధంగా గ్రామంలోని మెయిన్ రోడ్డు భీమడోలులోని థియేటర్ రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది. దీనితో ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గుండుగొలను సంతమార్కెట్ వద్ద గల మెయిన్ రోడ్డుపై నీరు నిలిచిపోతుంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీతో రైతులు అప్రమత్తమయ్యారు. కొన్ని రోజులుగా వర్షాలు పడకపోవడంతో ఈ వానలతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది.

ట్రాఫిక్ స్టేషన్‌కు కొత్త వాహనం



కొత్త వాహనాన్ని ఎస్పీ శివకిషోర్‌కు అందిస్తున్న యాజమాన్యం

ఏలూరు టౌన్: ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు నూతన బొలెరో వాహనం వచ్చింది. జిల్లా ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్‌కు బొలెరో కారును గుప్తా ఫౌండేషన్ యాజమాన్యం ఎమ్మెల్యే బడేటి చంటి సహకారంతో అందజేసింది. ఈ సందర్భంగా ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు ఆక్రమణలు తొలగించామన్నారు. నగరంలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే సహకించాలని కోరారు. గుప్తా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

15నుంచి జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ



భీమడోలులో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి ఇక్కుర్తి సాయి రమేష్

భీమడోలు: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు పాడి రైతులు తమ పశువులను టీకాలు వేసుకుని వాటిని సంరక్షించుకోవాలని భీమడోలు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ అన్నారు. భీమడోలులో శనివారం 7వ విడత జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీపై గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పశువులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహా ఈనెల 15వ తేదీ నుంచి భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకా తిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని పాడి పశువులకు ఉచితంగా గాలికుంటువ్యాధి నివారణ టీకాలు అందిస్తామన్నారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో 28,184 గేదెలు, 6,914 ఆవులు ఉన్నాయని, వాటిన్నింటికి ఉచితంగా వ్యాక్సినేషన్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. వర్షాకాలంలో పశువులకు వైరస్ సోకి జ్వరం రావడం, నోటి గాళ్లు, కాళ్లల్లో గాళ్లు ఏర్పడడం, దీనివల్ల పాలు తగ్గుతాయన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జే.శ్రీహరికృష్ణ, పి.చలపతి రావు, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పూళ్లలో..

జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలపై ఎటువంటి అపోహాలు వద్దని, పశువులకు టీకా మరవొద్దని పూళ్ల వెటర్నరీ వైద్యురాలు బి.నాగజ్యోతి శనివారం తెలిపారు. ఈనెల 15వతేదీ సోమవారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు. పాడి రైతులకు తమ పశువులకు ఉచిత టీకాలు వేయించుకోవాలని ఆమె కోరారు.

సేవాభావంతో వైద్య వృత్తిని నిర్వహించాలి



ప్రథమ చికిత్స దినోత్సవాన్ని చేస్తున్న బీఆర్‌డీ నర్సింగ్ విద్యార్థులు

దెండులూరు: ప్రజల ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను ప్రోత్సహించడమే ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవ లక్ష్యమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం జరిగింది. నర్సింగ్ విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ సేవా భావంతో వైద్య వృత్తిని నిర్వహించాలన్నారు. వైద్య పరీక్షలు వైద్య సేవలు గురించి అవగాహన కల్పించారు.

ఏలూరులో ఇఫ్టూ రాష్ట్ర శిక్షణ తరగతులు

ఏలూరు (టూటౌన్): నవంబర్ 1, 2, 3, 4 తేదీల్లో ఇఫ్టూ రాష్ట్రస్థాయి తరగతులు ఏలూరులో జరగనున్నాయని సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక మార్కెట్ యార్డులో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. దేశంలో మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు.